# పెళ్లికాని పెద్దమనిషి

"ఇదిగో ... మిస్టర్ కృష్ణమూర్తీ! నా మాట కాస్త విని వెంటనే పెళ్లి చేసుకో! సినిమాలు, ఆ పాడు హోటల్ తిండీ మానేస్తేగాని నువ్వు బాగుపడవు. మంచిరంభలాంటి అమ్మాయి కోసం కాచుకూర్చుంటే, కూచున్న చోటునే వుండిపోతావు. అంతే! అందుకని ఏదో ఓ సంబంధంచూసి సెటిల్ చేసేయమని మీ నాన్నగారికి రాసేయ్! ఎడ్రెస్సిస్తే... నేనూ ఓ కార్డుముక్క రాసిపడేస్తాను. ఇలాగ ఆఫీసులో కూర్చుని, పెళ్ళి కాలేదని ఎందుకు దిగులుపడతావు? ఎవర్నో తలచుకొంటూ ఆఫీసుపని యెందుకు తగలబెడ్తావు. వీలయినంత త్వరగా పెళ్లి చేసుకొని కుదుటపడటం మంచిది. ఏం... బోధపడిందా" అన్నారు మేనేజరుగారు.

కృష్ణమూర్తికి బోధపడలేదు. 'తనకు పెళ్ళవకపోతే, ఆఫీసు మేనేజరుగారికొచ్చే యిబ్బందేమిటో! తనలాగా ఆఫీసులో మిగత వాళ్లుకూడా అప్పుడప్పుడూ పరధ్యానంలో పడటంలేదూ? వాళ్లూ తరచు తప్పులు చేయటంలేదూ! తనలాగే ఫైళ్లు ఆలస్యం చేయటంలేదూ! మరి వాళ్ళ నోవిధంగానూ, తననింత చులకన గానూ చూస్తా రెందుకూ? పెళ్లికానివాడికి ఎన్ని బాధలు? పెళ్లయినవాడు ఎన్ని వేషాలు వేసినా ఫరవా లేదు. అతని పెద్దమనిషి తనానికి ఏమీలోపంరాదు. అదే తన లాంటి బ్రహ్మచారి ఏంచేసినా లోపంగానే కనిపిస్తుంది కాబోలు. తామునవ్వితే అది వెకిలిచేష్ట. తాము టక్ చేస్తే అదో డాబు!

సినిమాకు వెళ్లితే, షికారెళ్లితే అవన్నీ పోరంబోకుపనులు ! అదే పెళ్లియినవారు చేస్తే వాళ్ళు పెద్ద రసికులుగా, పెద్ద మనుష్యులుగా పరిగణింప బడుతారు. ఎంత అన్యాయం? ఎంతవిచిత్రం!' అనుకొన్నాడు కృష్ణమూర్తి.

"వెళ్లు! వెళ్లి కూర్చుని ఆ స్టేట్ మెంట్ కాస్త పూర్తి చేసి నామొహాన పడేసేయ్. కాసేపుకలలు కనడం మానేసి, ఆ పని శ్రద్ధగా చేసేయ్" అని ఫైళ్లలో తలదూర్చేసు కొన్నారు మేనేజరుగారు.

మేనేజర్ రామమూర్తితో అంటున్నారు:

"ఆ రిపోర్టు పూర్తి చేశారా? ఇంకాలేదూ! ఏమిటి అంత ఎక్కువగా వుందేమిటి మీ సీట్లో వర్కు"

"అవునుసార్. హెడ్డాఫీసుకు వెళ్లాల్సిన మంత్లీ స్టేట్ మెంట్స్ తయారు చేస్తున్నా" అన్నాడు రామమూర్తి.

"సరే చూడండి" అన్నారు మర్యాదగా మేనేజరు.

'పెళ్లయినవాడికి ఎన్ని సౌకర్యాలు ప్రపంచంలో. వాడు ఎన్ని వెధవపోకిళ్ళయినా పోవచ్చు. ఆఫీసులో తాపీగా పని చేయొచ్చు. వాడితో మేనేజరు అగౌరవంగా మాట్లాడరు. పెళ్ళి కాని వాడు అందరికీ లోకువే. ఇల్లు అద్దెకివ్వరు. పని మష్యులు రారు. పాలమ్మ ఆ ప్రక్కులకు రాదు. పెద్దమనుష్యులు సరదాగా మాట్లాడరు. కుఱ్ఱవాళ్లు గౌరవించరు. తోటి ఉద్యోగులు మర్యాదగా చూడరు. ఎప్పుడూ వేళాకోళాలాడుతూ వుంటారు. ఎన్నిపాట్లు... పెళ్ళి కాని వాడికి ఎన్ని ఇక్కట్లు. ఆఖరుకు ఆఫీసు ప్యూన్‌కూడా పిలిచిన గంటకు గానీ రాడు. ఎంత దుస్థితి !

తనకూ తొందరగా పెళ్ళయిపోతే బావుండును. ఆఫీసులో తాపీగా పని చేసుకోవచ్చు. పెద్దమనుష్యులతో దర్జాగా తిరగొచ్చు.

బ్రహ్మచారులైన ఉద్యోగుల దగ్గర డంబాలు కొట్టొచ్చు.

"మళ్ళా కలలు కంటున్నావూ! నేను మీ నాన్నగారికి రాస్తానన్నానుగా! ఇంక దిగులెందుకూ? రాసుకో రాసుకో. అది రాసి పూర్తిచేసేయ్. ఆనక కావలిస్తే ఓ అర్ధరోజు సెలవుపెట్టి కలలు కందువుగాని" అన్నారు మేనేజరు!

"ఛా...ఏం బ్రతుకురా యిది! పెళ్ళికాని వాడినని నాతో ఏకవచనంతో మాట్లాడుతాడూ? అదే రామ్మూర్తి తనలాంటి గుమాస్తాయే అయినా, అతణ్ణి పెళ్ళయినవాడని బహువచనంతో పలకరిస్తాడూ! వాడు ఎంత వెధవైనా పెళ్ళి కాగానే పెద్దమనిషై కూచుంటాడు.

సాయంకాలం ఐదుంపావయింది.

రామ్మూర్తి ఫైళ్ళన్నీ కట్టి పడేసి వెళ్ళిపోయాడు.

కృష్ణమూర్తికూడా లేచి "వెళ్తాను సార్" అన్నాడు.

"ఎక్కడికి వెళ్తావ్ రోడ్లమీద తిరగడానికా? కూర్చో కూర్చో. ఆ స్టేట్ మెంట్ పూర్తిచేసేయ్. వాళ్ళతోపాటు నువ్వూ పోతానంటావేమిటి! వాళ్ళంటే సంసారమూ అదీ వున్నవాళ్లు. ఇంటిపన్లూ అవీ వుంటాయి. నీకేం బ్రహ్మచారికి...హాయిగా ఆఫీసులో కుర్చీలో కూర్చుని చక్కగా పని చూసుకోకుండాను" అని మేనేజరు తలవంచుకొన్నారు.

చిరాకేసింది కృష్ణమూర్తికి. ఏమిటీ దారుణం! ఎంత అధమస్థితి తనది! రామ్మూర్తి ఎంత అదృష్టవంతుడు! తనను చూసి నవ్వుతూ తొందరగా వెళ్ళిపోయాడు. అతడి అర్ధాంగి వాకిలి దగ్గర నిల్చుని అతనికోసం చూస్తూ వుంటుంది. కొత్త చీర కట్టుకొని, చక్కగా, శుభ్రంగా అందంగా అలంకరించుకొని చూస్తూ వుంటుంది. టిఫినూ, కాఫీ వేడిగా తయారై వుంటాయి.

రామ్మూర్తిని చూడగానే సంతోషంతో పొంగి పోతుంది. రామ్మూర్తి అన్నీ మరచిపోయి భార్యతో కలిసి ఈ సాయంకాలం ఎంతో హాయిగా గడుపుతాడు. షికారు వెళ్తాడు. సినిమాకు వెళ్తాడు. ఎంత అదృష్టవంతుడు! తను ఎప్పుడు వెళ్ళినా అలా ఆహ్వానించే వాళ్ళుండరు. రూముకు ఎప్పటికీ వెళ్ళకపోయినా అడిగే వాళ్ళుండరు! అసలు ఆ గదిని చూస్తేనే డోకొస్తుంది. త్రాగడానికి మంచి నీళ్లుండవు. కూర్చోడానికి కుర్చీ వుండదు. ఏం వుండదు...! జీవితంలో సారంలేదు!

'రామ్మూర్తి భార్యచేసిన కాఫీని మెచ్చుకొని, ఆవిడను ముద్దుపెట్టుకొంటూ వుంటాడీపాటికి! ఆవిడ కిలకిలా మధురంగా నవ్వుతూ వుంటుంది!

"స్వామీ ఆ ఫైలిలా నా మొహాన పడేయ్!"

*  *  *

ఆరూ ముప్పైకి ఆఫీసు వదిలిపెట్టి కాళ్లీడ్చుకుంటూ వెళ్ళి హోటల్లో కాఫీ పుచ్చుకున్నాడు. రూముకు వెళ్లాలని లేదు.

'రామ్మూర్తి భార్యతో హాయిగా గడుపుతూ వుంటాడు' అనుకొన్నప్పుడు అతనిమీద బలేఅసూయకలిగింది కృష్ణమూర్తికి!

అలా నడుస్తూ వెళ్లి టిక్కెట్ కొనుక్కొని వెళ్ళి సినిమాహాల్లో కూర్చున్నాడు. 'పెళ్ళయినవాళ్లు యిలా మధ్యలో రారేమో' అనుకొన్నాడు. చిత్రంలో నాయకీనాయకుల ప్రణయ కలాపం రసవత్తరంగా సాగుతోంది. కృష్ణమూర్తి ఎలాగో అయిపోయాడు. 'ఎంత ఉత్తమమైన జన్మ అతనిది! ఆ పాత్రధారిది' అనుకొన్నాడు.

తర్వాత నాయికానాయకుల మధ్య విలన్‌లు ప్రవేశించారు. చాల కష్టాలు ఎదుర్కొన్నారు. ఆఖర్న బాక్సాఫీస్ హిట్ అవడంకోసం కథ సుఖాంతమైంది. యుగళ గీత మాలపించారు

నాయకీ నాయకులు. గీతం పూర్తి కాగానే నాయకుడు నాయికని దగ్గరకు తీసుకొన్నాడు. ఆవిడ మొహం వికసిస్తూ వుంటే కృష్ణమూర్తి లేచి వచ్చేశాడు.

రాత్రి గదిలో నల్లులు అతని రక్తం పీల్చేశాయి.

'రామ్మూర్తి యింట్లో నల్లులుండవు. హాయిగా సుఖంగా పడుకొని వుంటాడు రామ్మూర్తి. అతను కళ్ళు తెరిస్తే సుందర రూపం సాక్షాత్కరిస్తుంది. తను కళ్ళు తెరిస్తే గోడమీద నల్లులు మిలమిల లాడుతూ కనిపిస్తయ్.'

తెల్లవారింది. కృష్ణమూర్తి లేచి మొహం కడుక్కొని చన్నీళ్లస్నానం చేశాడు. చాల చలిగావుండి వొణుకు పుట్టింది.

'రామ్మూర్తి లేచేసరికి, భార్య వేణ్ణీళ్ళు సిద్ధంచేసి వుంచుతుంది. అతను ఈ చలిలో హాయిగా వేణ్ణీళ్ళు మీద పోసు కొంటూ ఆనందిస్తూ వుంటాడు.' అనుకొన్నాడు కృష్ణమూర్తి.

స్నానం పూర్తయింది. హోటల్‌కువెళ్లి ఉడికీఉడకని ఇడ్లీలు తిని ఆఫీసుకు బయలుదేరాడు.

'రామ్మూర్తి భార్య వేడి వేడిగా టిఫిన్ చేసిపెట్టివుంటుంది' అనుకొని కృష్ణమూర్తి వుడికిపోయాడు.

తను దిక్కులేని బ్రతుకు బ్రతుకుతున్నాడు. అక్కయ్యకు పెళ్ళయ్యేవరకు తనకు పెళ్లవదు. అక్కయ్యకు పెళ్ళికాదు. కట్నం ఇచ్చుకోలేరు. ఆడపిల్లలు ఎక్కువ చదివితే చెడిపోతారని నాన్న ఆమెను చదివించలేదు. వంటచేస్తే చేతులు కాల్చుకొంటుందని అమ్మ వంటకూడా నేర్పలేదు. ఆ మాటకొస్తే తనకుకూడా త్వరగా పెళ్ళికాదు. తను బియ్యే పాసయి ఈ కంపెనీలో గుమాస్తా ఉద్యోగం చేస్తున్నాడు. పెద్దలు గడించి పెట్టిపోయిన ఆస్థిపాస్తులు లేవు. "పెద్ద ఉద్యోగం చూసిపెట్టే పెద్ద దిక్కులు" లేరు.

మరి పిల్లనిచ్చే సాహసవంతు లెవరుంటారు. అంచేత లాభంలేదు! పెళ్ళికాదు" అనుకొని ఉసూరుమన్నాడు కృష్ణమూర్తి.

ఆఫీసు వరండాలో నిల్చుని రామ్మూర్తి ఏదో ఆలోచిస్తున్నాడు.

"హాయిగా కొత్తగా పెళ్ళిచేసుకొని సుఖపడుతూ కూడా అలా దిగులుతో యిదవుతున్నా రేమిటి?" అని పలకరించా డతణ్ణి.

"పెళ్ళీ...ఎవరు చెప్పారు స్వామీ! అసలు పెళ్ళిచేసుకొనే ఉద్దేశ్యమే నాకు లేదు. నా విషయం మీకు తెలీదేమో. మా నాన్న పోయాడు. నాకు నలుగురు తమ్ముళ్ళు చిన్న వాళ్లు! ముగ్గురు చెల్లెళ్ళు ...పెళ్ళి కెదిగిన వాళ్లు. ఇంటికి నేనే పెద్దని! వీళ్ళని చదివించి, పెళ్లి చేసి, వాళ్ల జీవితాల్ని బాగుచేయవలసిన బాధ్యత నామీదే వుంది. మీరు అదృష్టవంతులు. ఏ బాధ్యతా బరువూ లేకుండా హాయిగా కాలం గడిపేస్తూ వున్నారు" అన్నాడు రామ్మూర్తి.

"పెళ్లి కాని పెద్దమనుష్యులుకూడా వుంటారన్నమాట!

రామ్మూర్తికన్న తనే మేలన్నమాట!

తన బ్రతుకేం బంగారు బ్రతుకు!

పెళ్ళి కాకుంటే నేం? రాజా బ్రతుకు!" అనుకొని ఉత్సాహంతో ఆఫీసులో ప్రవేశించాడు. సీట్‌లో కూర్చుని శ్రద్ధగా చకచకా తన పని చేసుకుపోతున్న కృష్ణమూర్తిని, చిత్రంగాచూసి "తొందర తొందరగా రాసిపారేసి ఫైళ్లునాశనం చేయకు. మళ్లా వాటిని సర్దుకోలేక నేను చావాలి" అని కసురు కొన్నారు మేనేజరుగారు.

శ్రీ వేదవ్యాస ప్రెస్, చిత్తూరు.